ప్రజాశక్తి
ఆదివారం 8 జూన్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

# డీలర్లపైనా మాఫియా ప్రభావం

## కొన్ని డిపోల్లో బియ్యం బదులు డబ్బులు పంపిణీ - విజిలెన్సు అధికారుల ప్రేక్షకపాత్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రేషన్ సరఫరాలో మార్పులు చేసినా ప్రభుత్వం ఆశించిన మార్పులు రావడం లేదు. గతంలో మాదిరిగానే ప్రజలకు బియ్యంకు బదులు సొమ్ములు ఇస్తున్నారు. డీలర్లపైనా మాఫియా ప్రభావం తగ్గడం లేదు. రేషన్ వాహనాలు బియ్యం సరఫరా కంటే అక్రమ రవాణాకు ఆనువుగా మారాయని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపాయి. వాహనాల స్థానంలో 2020కి ముందు ఉన్నట్టుగానే డీలర్ల ద్వారానే ఈనెల ఒకటి నుంచి రేషన్ పంపిణీ పున: ప్రారంభించారు.



ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 2800 చౌకడిపోలు ఉండగా గతవారం రోజుల్లో 70 శాతం మేరకు రేషన్ పంపిణీ జరిగినట్టు అధికార వర్గాలు తెలిపాయి. పల్నాడు జిల్లాలో మొత్తం 6,34,893 కార్డులు ఉండగా శనివారం మధ్యాహ్నం వరకు 4,72,642 కార్డుల వారు 74.44 శాతం మంది రేషన్ తీసుకున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. గుంటూరు జిల్లాలో 5,89,531 కార్డులు ఉండగా 3,69,931 మంది కార్డు దారులు 62.75 శాతం మంది రేషన్ పొందారు. రేషన్ వాహనదారులు ఏ సమయంలో వస్తారో తెలియని పరిస్థితుల్లో సరుకులు తీసుకునే వారి సంఖ్య ప్రతి నెలా 80 శాతంలోపు ఉండేదని, ఇప్పుడు 90 శాతం వరకు పంపిణీకి అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. పల్లెల్లో 90 శాతం, పట్టణాల్లో 85 శాతం డీలర్ల వద్ద పంపిణీ జరుగుతుందని అంచనా వేస్తున్నారు. డీలర్ల వద్ద నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఇప్పటికే పలు ప్రాంతాల్లో అధికారులు పట్టుకున్నారు.

రేషన్ పంపిణీలో జాగ్రత్తలు పాటించాలని, ప్రజల నుంచి బియ్యం తిరిగి తీసుకునే విధానానికి స్వస్తి చెప్పాలని ప్రభుత్వం చెప్పినా కొంత మంది డీలర్లు పాత పద్ధతిలోనే బియ్యం బదులు వినియోగదారులకు కిలో రూ.10 నుంచి రూ.12 వరకు సొమ్ములు ఇస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. గత నెల వరకు ఎండియు వాహనదారులు ప్రజలకు బియ్యం, ఇతర వస్తువులు ఇవ్వకుండా కిలోకు రూ.8 నుంచి రూ.12 వరకు పరిస్థితులు బట్టి డబ్బు ఇచ్చి పంపే పద్ధతి కొనసాగించారు. ఉమ్మడి జిల్లాలో 901 వాహనాలు రద్దు చేయడంతో డీలర్ల వద్ద పంపిణీ జరుగుతోంది. అయితే డీలర్ల వద్ద అక్రమంగా బియ్యం కొనుగోలు చేసే మాఫియా బృందాలు గుంటూరులో తమ పంథాను కొనసాగిస్తున్నారు.

గతంలో డీలర్ల వద్ద నుంచి బియ్యం కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలించిన రేషన్ మాఫియా గత నాలుగేళ్ల నుంచి వాహనదారుల నుంచి బియ్యం కొనుగోలు చేయడంలో కీలక భూమిక పోషించింది. నాలుగేళ్ల తరువాత మళ్లీ తమ పాత పద్ధతి ప్రకారం డీలర్ల ద్వారానే రేషన్ బియ్యం తీసుకుని ఇతర రాష్ట్రాలకు పంపే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ప్రధానంగా డిప్యూటీ తహశీల్దార్లు ఎక్కువ మంది జిల్లాలో రేషన్ అక్రమాలను పట్టించుకోకుండా డీలర్ల వద్ద నుంచి మామూళ్లతో ఒప్పందాలు చేసుకుంటున్నారని తెలిసింది. రెవెన్యూ, పౌరసరఫరాల విజిలెన్సు విభాగం కూడా రేషన్ మాఫియాను నియంత్రించలేకపోతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

# స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఆడ్డుకోండి

## ప్రజలకు సిపిఎం పిలుపు



విలేకర్లతో మాట్లాడుతున్న నళినీకాంత్

ప్రజాశక్తి - గుంటూరు

ప్రజలకు భారంగా మారబోతున్న ప్రీపెయిడ్ స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించడానికి వస్తే అడ్డుకోవాలని ప్రజలకు సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారంలో భాగంగా ముద్రించిన కరపత్రాలు, స్టిక్కర్లు, పోస్టర్లలను బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నళినీకాంత్ మాట్లాడుతూ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల భవిష్యత్‌లో అనేక ప్రమాదాలున్నాయన్నారు. ఇప్పటి వరకూ వాడుకున్న విద్యుత్‌కు బిల్లు చెల్లిస్తున్నామని, ఇక నుండి ముందుగానే రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుందని, చెల్లించిన డబ్బులు అయిపోతే విద్యుత్ సరఫరా ఆగిపోతుందని అన్నారు. మీటర్ బిగించేటప్పుడే మూడు నెలల అడ్వాన్స్ బిల్లు డిపాజిట్‌గా కట్టించుకుంటూ, ప్రీపెయిడ్ పద్ధతి తీసుకురావడం అన్యాయమన్నారు. పీక్ అవర్స్‌లో స్మార్ట్ మీటర్ ద్వారా అదనపు చార్జీ వసూలు చేసేలా మరో దుర్మార్గపు ఎత్తుగడకు ప్రభుత్వం పాల్పడబోతున్నదని, సాయంత్రం 6 నుండి10 గంటల మధ్య, ఎండాకాలంలో పగలు వాడే కరెంటుకు ఎక్కువ ఛార్జీ వసూలు చేయటం ఈ స్మార్ట్ మీటర్ ప్రత్యేకతని విమర్శించారు. ఇప్పటివరకు తక్కువ యూనిట్లు కరెంటు వినియోగించే పేదవాళ్లకు తక్కువ బిల్లు వచ్చేదని, రాబోయే కాలంలో ఈ అవకాశం ఉండదని చెప్పారు. ఇన్ని ప్రత్యేకతలున్న ఈ స్మార్ట్ మీటర్ ఖర్చు రూ.15 వేలను ప్రభుత్వం వినియోగదారుల నుండే బలవంతంగా 96 నెలల్లో వసూలు చేస్తుందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం వ్యక్తిగత విమర్శలు చేసుకుంటూ ప్రజలపై భారాల విషయంలో ఒకే విధానం అనుసరిస్తున్నాయని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను, ట్రూ ఆప్, ఇంధన సర్దుబాటు ఛార్జీలను, విద్యుత్ సెకీ ఒప్పందాలను తీవ్రంగా వ్యతిరేకించిన టిడిపి నేతలు అధికారంలోకి రాగానే వాటినే కొనసాగిస్తుందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం ప్రారంభించిన ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానం వల్ల పట్టణ ప్రజలపై ఐదేళ్లలో వంద శాతం పెన్నులు పెరిగాయని, ఇదే విధానాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోందని, అంతే కాకుండా మరో 20 శాతం అదనపు పన్ను భారం ప్రజలపై మోపటానికి సిద్ధమైందని దుయ్యబట్టారు. అదనపు పన్నుల ద్వారా గుంటూరు నగర ప్రజలపై రూ.32 కోట్లు భారం పడుతుందన్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, ఇంటి పన్ను పెంపునకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించబోతున్నట్లు చెప్పారు. సమావేశంలో నగర కార్యదర్శి వర్గసభ్యులు బి.ముత్యాలరావు, కె.శ్రీనివాసరావు, నగర కమిటీ సభ్యులు షేక్ ఖాశిం షహీద్ పాల్గొన్నారు.

## ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

నేడు డిఇఒ ఆఫీసు ముట్టడికి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు - 8 లో

## వానకు కూలిన చెట్లు.. తెగిన విద్యుత్ తీగలు



బుర్రిపాలెం రోడ్డులో పడిపోయిన చెట్లు, విద్యుత్ తీగలు

ప్రజాశక్తి - తెనాలి : మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బయటకు రావాలంటే భయపడేలా ఎండ సెగలు పుట్టించింది. విపరీతమైన వేడి, ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరయిన తరుణంలో శనివారం సాయంత్రం వేళ వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో ప్రజలు ఉక్క పోత నుండి ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈదురు గాలుల ధాటికి రూరల్ పరిధిలో చెట్లు విరిగిపడిపోగా, విద్యుత్ లైన్లు తెగిపోయాయి. దీంతో డి3 సెక్షన్ పరిధిలో బుర్రిపాలెం రోడ్డులో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు సాయంత్రం 6 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచింది. పునరుద్ధరణ చర్యల్లో ఆ శాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు. గంటలో విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని విద్యుత్ ఎఇ సుధీర్ తెలిపారు.

## అన్నదాత సుఖీభవ కౌలు రైతులకూ ఇవ్వాలి

11న ధర్నా జయప్రదం చేయాలని నాయకుల విస్తృత ప్రచారం - 8 లో

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు

## 107, 108 జీవోలను రద్దు చేయాలి - ప్రజారోగ్య వేదిక రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్




మాట్లాడుతున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించబోతున్న 12 మెడికల్ కాలేజీలను పిపిపి విధానం పేరుతో ప్రైవేటీకరించే చర్యలు మానుకోవాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నూతన మెడికల్ కాలేజీలను నిర్వహించాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.వి.రమణయ్య డిమాండ్ చేశారు. 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు-ప్రైవేటీకరణ' అంశంపై బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. రాష్ట్ర మెడికల్ విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మించాల్సిన మెడికల్ కళాశాలలను మనతోటి తెలుగు రాష్ట్రమైన తెలంగాణ రాష్ట్రం నడుపుతున్నప్పుడు, మా దగ్గర డబ్బులు లేవని, ఆ సేవలను అందించలేమని చెప్పడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యమన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మిస్తామని సిఎం చంద్రబాబు ప్రకటించడం చాలా సంతోషమని, అయితే ఆ ఆసుపత్రులను పిపిపి పద్ధతులో ఏర్పాటు చేస్తామనడం చాలా బాధాకరమని అన్నారు. మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు కార్పొరేట్ పరమైతే పేదలకు వైద్యం, వైద్య విద్య దక్కవన్నారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీట్లను అమ్ముకోవడానికి గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 107, 108 జీవోల వలన ఆరోగ్య రంగానికి చాలా 2లో



## టిడిపినాయకులకు ఎమ్మెల్యే నివాళి

**ప్రజాశక్తి - వెల్దుర్తి:**

మాచర్ల నియోజకవర్గానికి పట్టిన పీడ, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. శనివారం వెల్దుర్తి మండలం,గుండ్లపాడు గ్రామంలో ప్రత్యర్థుల చేతిల్లో హతులైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల సంతాప సభలో ఎమ్మెల్యే జూలకంటి పాల్గొని.., వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.., జంట హత్యల కేసులో ఎంతటి వారున్నా.., వదిలే ప్రసక్తే లేదన్నారు. పచ్చని పల్లెల్లో పిన్నెల్లి సోదర్లు కాలుష్యాన్ని సృష్టించి.., విషబీజాలను నాటుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు, దౌర్జన్యాలతో నియోజకవర్గాన్ని భయభ్రాంతులకు గురిచేయాలని చూసే.. ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేకే దాడులు చేయించి, అలజడులు సృష్టిస్తున్నారని ఆయన వాపోయ్యారు. పల్నాడు ప్రశాంతత కోసం సంఘ విద్రోహ శక్తులను చట్టప్రకారం శిక్షిస్తామన్నారు. జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**కోవర్టు రాజకీయాలు మానుకోవాలి**

కోవర్టు రాజకీయాలు మానుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకుంటారని పిన్నెల్లి సోదర్లను ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి హెచ్చరించారు. వరికపూడిశెలను నిర్మించి.., పల్నాడు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోందని ఆయన భరోసా చేశారు. సోషల్ మీడియా వేదికగా కూటమి ప్రభుత్వాన్ని కించపర్చిచేలా పోస్టులు పెడితే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రమాదమని, మా ప్రభుత్వం వస్తే ఆ జీవోలను రద్దు చేస్తామని చెప్పిన టిడిపి, జనసేన పార్టీలు రద్దు చేయకుండా కొనసాగిస్తున్నాయని విమర్శించారు. ఈ సెల్ఫ్‌ఫైనాన్స్ పద్ధతి కారణంగా సగం సీట్లు ప్రభుత్వం అమ్ముకుంటుందన్నారు. గవర్నమెంట్ కాలేజీలలో కన్వీనర్ కోటా సీటుకి ఏడాదికి రూ.15వేలు ఫీజు ఉంటే, మేనేజ్‌మెంట్ కోటా సీటుకి రూ.12 లక్షలు, ఎన్ఆర్ఐ కోటా సీటుకి ఏడాదికి రూ.20 లక్షల చొప్పున నిర్ణయించి వసూలు చేస్తుందని, దీని వల్ల పేద విద్యార్థులు డాక్టర్లు అయ్యే అవకాశం తగ్గిపోతుందని వివరించారు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్ అవకాశం తగ్గిపోతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానానికి కట్టుబడి 107, 108 జీవోలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు వల్లూరి సదాశివరావు మాట్లాడుతూ పిపిపి విధానంలో నిర్మించబోయే వైద్య కళాశాలలకు ప్రభుత్వమే అన్ని సదుపాయాలు కల్పిస్తుందన్నారు. కాలేజీల నిర్మాణానికి కేంద్రం 45 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం నిధులు ఇస్తుందని, మిగిలిన 25 శాతమే ప్రైవేటు సంస్థలు ఇస్తాయని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం వైబిలిటీ గ్యాప్ ఫండ్ అనే పేరుతో కొంత నిధులను కూడా సమకూరుస్తున్నారని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన భూమిని ఒక్క రూపాయికి లీజుకు ప్రభుత్వమే ఇస్తుందన్నారు. ఇంతా చేసి, నిర్వహణ మాత్రం ప్రైవేటు వారికి కట్టబెడుతుందని విమర్శించారు. జెవివి నాయకులు ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు మాట్లాడుతూ పిపిపి విధానం వైద్య కాలేజీలకే కాకుండా, ఇతర అన్ని రంగాలకూ విస్తరిస్తుందని అన్నారు. ఆసుపత్రులను, ఇప్పటికే ఉన్న కాలేజీలను కూడా ప్రైవేటుపరం చేస్తారని అన్నారు. ప్రజారోగ్య వేదిక జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పిపిపి విధానం అమలైతే వైద్య కాలేజీల్లో ఫీజులు పెరుగుతాయని, పేద విద్యార్థులు డాక్టర్లయ్యే అవకాశం తగ్గిపోతుందని చెప్పారు. ఈ ప్రమాదకర విధానాన్ని వెనక్కి కొట్టటమే రాష్ట్ర ప్రజల ముందున్న కర్తవ్యమన్నారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# 186వ రోజుకు ఎసిసి ఫ్యాక్టరీ కార్మికుల దీక్షలు

**ప్రజాశక్తి- తాడేపల్లి**

తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 186వ రోజుకు చేరు కున్నాయి. దీక్షలో ఎం.గురవయ్య, డి.నాగేశ్వరరావు, ఇస్మాయిల్, ఎం.పిచ్చయ్య, సారమ్మ, దుర్గాభవాని కూర్చున్నారు. దీక్షలను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాలకుల విధానాల వల్ల 170 మందికి పైగా ఎసిసి కార్మికులు చని పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 33 సంవత్సరాలు ఫ్యాక్టరీ మూతపడి కార్మికులు వారి సమస్య పరిష్కారం కోసం పోరాడుతూ ఉంటే ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదని విమర్శించారు. అనేక ప్రభుత్వాలు మారినప్పటికీ కార్మికుల తలరాతలు మాత్రం మారడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఒక్క ప్రభుత్వం ఎసిసి సమస్యను పరిష్కరించక పోవడం చాలా అన్యాయమని అన్నారు. మంత్రి లోకేష్ ఎసిసి కార్మికులు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే ఎసిసి సమస్య ను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.గురవయ్య, సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, ఎం.ఆశీర్వాదం, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

# అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డ రాజధాని మహిళలు

**ప్రజాశక్తి - తుళ్లూరు**

ఒక మీడియా ఛానెల్‌లో వివిఆర్ కృష్ణంరాజు తమను,రాష్ట్ర మహిళలను కించపరుస్తూ మాట్లాడారంటూ రాజ ధాని మహిళా రైతులు,రైతులు,రైతు కూలీలు మండిపడ్డారు. రాజధాని అమరావతిపై విషం చిమ్ముతున్న ద్రోహులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శనివారం వివిధ గ్రామాల నుంచి తుళ్లూరుకు చేరుకున్న రైతులు, మహిళలు పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ జరిపారు.పోలీసులకు ఫిర్యాదు చేశారు. కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు చిత్రపటాలను దహనం చేశారు. .అమరావతిని వేశ్యల రాజధానిగా పోల్చిన దుర్మార్గులను 24 గంటల్లో అరెస్టు చేయాలని, లేనిపక్షంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రానికి రాజధాని కావాలన్న సంకల్పంతో వారసులకు ఇవ్వాల్సిన భూములను రాజధాని నిర్మాణానికి ఇస్తే మహిళా రైతులను ఇష్టమొచ్చినట్లు అవమాన కరంగా మాట్లాడతారా.. అని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి దళిత జెఎసి కో కన్వీనర్ మేరిగ నాగేశ్వరరావు(బుజ్జి) మాట్లాడుతూ,ఎస్సీ నియోజక వర్గమైన తాడికొండలో రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతోందని,దీనిని వేశ్యల రాజధాని అంటే.. ఎస్సీ లను అంటున్నారా.. అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై అవాకులు, చవాకులు పేలితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తుళ్లూరు లైబ్రరీ సెంటర్‌లో మానవహారంగా నిరసన తెలిపారు.

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

విశ్లేషణల పేరిట మహిళల వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్న విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చానల్ యాజమాన్యం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని కూటమి మహిళా అధికార ప్రతినిధులు తీవ్రంగా హెచ్చరించారు. శనివారం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి అధికార ప్రతినిధులు గద్దె అనంతలక్ష్మి, మానుకొండ




## కృష్ణంరాజు, కొమ్మినేనిని అరెస్టు చేయాలని డిమాండ్



జాహ్నవి తదితరులు మాట్లా డుతూ అమరావతిని నిర్వీర్యం చేశారని రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టు పనులను అర్ధాంతరంగా నిలిపివేశారని అనేక అవినీతి, అక్రమాలకు తెరలేపారని రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి శాసనాలు చేయాల్సిన చట్ట సభలలో సభ్యసమాజం తల దించుకునేలా మంత్రులు, ఎమ్మెల్యే లు వ్యవహరించారని మండిపడ్డారు.అవినీతి, అసమర్థ పాలన నేపథ్యంలో వైసిపిని రాష్ట్ర ప్రజలు 11 టిక్కెట్లకు పరిమితం చేశారని అయినా ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరించడం సరికాదన్నారు. దళిత మహిళలను కించపరిచేలా మాట్లాడిన వారిపై సుమోటోగా కేసు నమోదు చేయాలని రాష్ట్ర హోంమంత్రి, మహిళా కమిషన్‌ను కోరతామన్నారు. జనసేన మహిళా కార్యదర్శి వెంకట సుబ్బమ్మ, జక్కుల నిర్మల, తెలుగు మహిళ నాయకురాలు పాలడుగు రత్న కుమారి, పట్టణ అధికార ప్రతినిధి చింతపల్లి శారద, ఉప్పుటూరి తులసి తదితరులు ఉన్నారు.

**ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్**

అమరావతి మహిళలని వేశ్యలుగా కృష్ణంరాజు మాట్లాడటం, దానికి కొమ్మినేని శ్రీనివాసరావు వంత పలకడం అత్యంత సిగ్గుచేటని టిడిపి మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. సత్తెనపల్లి ప్రజావేదిక టిడిపి మహిళలు శనివారం విలేకరులతో మాట్లాడారు. దేవతల రాజధాని అమరావతిని కించపరిచే విధంగా మాట్లాడిన కృష్ణంరాజును బహిరంగంగా ప్రభుత్వం శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం మండల పట్టణ మహిళా నేతలు పాల్గొన్నారు.

# పోలీసుల వేధింపులపై న్యాయపోరాటం

## సజ్జల రామకృష్ణారెడ్డి

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

కూటమి ప్రభుత్వంలో ప్రజలను వేధిస్తున్న తీరుపై న్యాయపోరాటం చేస్తామని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి. తెలిపారు. గుంటూరులోని రమేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ కార్యకర్త లక్ష్మీనారాయణను శనివారం పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కొందరు పోలీసులు చంద్రబాబు, లోకేష్ ప్రైవేటు సైన్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. పోలీసులు చట్టాలను చేతుల్లోకి తీసుకుంటే సమాజానికే చేటు అన్నారు. కొందరు పోలీస్ అధికారుల వల్ల మొత్తం వ్యవస్థకు చెడ్డపేరు వస్తుందన్నారు. పోలీసుల వేధింపులు, దాడులు, అక్రమ కేసులపై ఇప్పటికే పలువురు బాధితులు హైకోర్టును ఆశ్రయించారని, త్వరలో మానవ హక్కుల కమిషన్, ఇతర న్యాయపరమైన కమిషన్లను ఆశ్రయిస్తామన్నారు.వైసిపి కార్యకర్త లక్ష్మీనారాయణను సత్తెనపల్లి డిఎస్‌పి హనుమంతరావు కులం పేరుతో మాట్లాడటం దారుణం అన్నారు. డిఎస్‌పి వ్యాఖ్యలకు కలత చెందిన లక్ష్మీనారాయణ ఆత్మహత్యాయత్నం చేశారని అన్నారు. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో జ్యుడీషియల్ ఎంక్వయిరీ జరిపించాలని కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజ్యహింస ఘటనలపై రాష్ట్రపతికి, జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. లక్ష్మీనారాయణ ప్రాణత్యాగానికే సిద్ధపడి, ఇప్పుడు ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య ఉన్నారు. లక్ష్మీ నారాయణను.. నీవు, ఫలానా కులం వాడివి కాదా?



ఈ పార్టీతో ఎలా ఉన్నావంటూ.. సాక్షాత్తూ డీఎస్పీ నిందిస్తూ పంచాయతీ చేయడం చూస్తుంటే ఈ రాష్ట్రం ఎటుపోతోందనే అనుమానం కలుగుతోందన్నారు. రాష్ట్రంలో ఒక బలమైన రాజకీయపార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలపైనే పోలీసులు ఇటువంటి దౌర్జన్యాలకు పాల్పడుతుంటే, ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటి? శాతవాహన కాలేజీ నిర్వాహకులపై టిడిపి చెందిన ఒక ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో కిడ్నాప్ చేశారు. తెనాలిలో ముగ్గురు యువకులను నడిరోడ్డుపై లాఠీలతో చావబాదారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు, నగర వైసిపి అధ్యక్షురాలు నూరిఫాతిమా, వైసిపి నాయకులు అన్నాబత్తుని శివకుమార్, గజ్జల భార్గవ రెడ్డి, పానుగంటి చైతన్య తదితరులు పాల్గొన్నారు.



ఆత్మహత్య చేసుకున్న గందు జగదీష్

## యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - తాడేపల్లి



నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం

గుంటూరుకు చెందిన యువకుడు తాడేపల్లిలో ఎత్తైన భవనం మీద నుండి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. తాడేపల్లి సిఐ బత్తుల కళ్యాణ రాజ్ కథనం ప్రకారం తాడేపల్లి బైపాస్ రోడ్ సమీపంలో సర్వీస్ రోడ్డులో బహుళ అంతస్తుల బిల్డింగ్‌ల నిర్మాణం జరుగుతోంది. ఈ క్రమంలో గుంటూరు, విద్యానగర్ మూడో లైన్‌కి చెందిన గందు జగదీష్ (35) ఎత్తైన భవనంపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలు పరిశీలిస్తున్నామని సిఐ తెలిపారు.

## చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మాచర్ల

పాత కక్షల నేపథ్యంలో ఈ నెల రెండవ తేదీన మాచర్ల పట్టణంలోని, 17వ వార్డు ఎరుకల కాలనీలో జరిగిన గొడవలో తీవ్ర గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మానుపాటి వెంకట కోటయ్య (మాజీ హెూంగార్డు) మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసులు వివరాల మేరకు తన తండ్రిని చంపాడన్న అనుమానంతో మానుపాటి శ్రీనాథ్ వెంకట కోటయ్యపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. చనిపోయిన వెంకటకోటయ్యపై రౌడీషీట్ ఉంది. హత్య, హత్యాయత్నం కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు.



# ఉచిత కంటి వైద్యశిబిరాల నిర్వహణ తమకో అవకాశం

### శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గవ్యాప్తంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల్లో చూపు సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత కంటి వైద్య శిబిరాల నిర్వహణను తాము ఒక మంచి అవకాశంగా భావిస్తున్నామని, ఈ మంచి కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తామని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు వినుకొండ గంగినేని కల్యాణ మండపంలో శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జీవీ ఆంజ నేయులు, డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు హాజరయ్యారు. శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఇటీవల కంటి శుక్లాల శస్త్రచికిత్స చేయించుకున్న వారికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కంటి ఆపరేషన్లు చేయించే అవకాశం తమకు దక్కినందుకు సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న తరుణంలో అర్హులైన ప్రతిఒక్కరికీ ఫించన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో రానివారికి కూడా త్వరలో పింఛన్లు అందిస్తామన్నారు. కొత్త పింఛన్లతో పాటు ఇళ్లు లేనివారికి స్థలాలు, ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

## దాడి ఘటనపై స్టేషన్లో కేసు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని కొండవీడు గ్రామంలో దారుణమైన ఘటన చోటు చేసుకుంది. ఆ వృద్ధురాలు ఒకరికి అమ్మమ్మ, మరొకరికి నాయినమ్మ అవుతుంది. విచక్షణ కోల్పోయిన మనవళ్లే ఆమెపై దాడి చేయడంపై పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కొండవీడు గ్రామానికి చెందిన తోట లక్ష్మీకాంతమ్మ తన మనవళ్లు మహేష్ బాబు, దమ్ము రామారావుకు తరచూ డబ్బులు ఇస్తుంటుంది. ఈ విషయాన్ని వారి తల్లులకు చెప్పిందని ఆగ్రహిస్తూ ఈనెల 4వ తేదీన మహేష్‌బాబు తన నాయినమ్మపై గొడవపడి జుట్టుపట్టుకుని కొట్టాడంటూ ఫిర్యాదులో పేర్కొంది. దాడి చేయగానే ఆమె కొండవీడు నుంచి చిలకలూరిపేటలో నివాసం ఉంటున్న తన కుమార్తె మాధవి వద్దకు వెళ్లింది. అయినా ఆమెకు ఫోన్లు చేసి మనవళ్లు వేధింపులకు గురి చేయడంతో పోలీసులను ఆశ్రయించి తన గోడును విన్నవించుకుంది. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి శివరామకృష్ణ తెలిపారు.

## ఏపీ సేవ పోర్టల్ తాత్కాలిక నిలుపుదల

ప్రజాశక్తి - క్రోసూరు

ప్రభుత్వ సూచనల మేరకు, గ్రామ/వార్డు సచివాలయ శాఖ నిర్వహిస్తున్న ఏపీ సేవపోర్టల్‌ను మైక్రోసాఫ్ట్ యజుర్ క్లౌడ్ నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డేటా సెంటర్‌కు తరలింపు (మైగ్రేషన్) చేపడు తోందని క్రోసూరు మండల ఇంచార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉదయం నుండి మంగళవారం రాత్రి వరకు ఏపీ సేవ పోర్టల్ ద్వారా అందించు సేవలను నిలుపుదల చేయటమైనదని అన్నారు. ఈ కారణం గా ఈ క్రింది సేవలు 07.06.2025 (శనివారం) ఉదయం నుండి 10.06.2025 (మంగళవారం) రాత్రి వరకు అందుబాటులో ఉండవు. ఆదాయ ధ్రువీకరణ పత్రం, సమగ్ర ధ్రువీకరణ పత్రం, భూమి మ్యూటేషన్లు రేషన్/రైస్ కార్డులు,ఇల్లు స్థల పట్టాలు, వృద్ధాప్య ధ్రువీకరణ పత్రాలు .వివాహ ధ్రువీకరణ పత్రం ,రెవెన్యూ వాటర్ ట్యాక్స్ పట్టణ పరిపాలన సంబంధిత సేవలు మత్స్యశాఖ సేవలు పై సేవల మినహా, మిగిలిన ఇతర ప్రభుత్వ సేవలు మీసేవా కేంద్రాలలో అందుబాటులో ఉంటాయని చెప్పారు.

## ఎమ్మెల్యే జీవీని కలిసిన గోరంట్ల సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి



మక్కెన మల్లికార్జునరావుని సత్కరిస్తున్న గోరంట్ల సత్యనారాయణ

ఈపూరు మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ గోరంట్ల సత్యనారాయణ ప్రభుత్వ చీఫ్ విప్, జీవి ఆంజనేయులుని శనివారం వినుకొండ పట్టణంలోని వారి నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా ఈనెల 5వ తేదీన బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా మాజీ శాసన సభ్యులు, మక్కెన మల్లి కార్జునరావుని దశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



## యువకుడు అరెస్టు


ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను దూషించిన కేసులో నరసరావుపేట మండలం ములకలూరు గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్‌ను నరసరావుపేట రూరల్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. నరసరావుపేట జనసేన నేత లక్ష్మీనారాయణ ఇర్ఫాన్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - తాడేపల్లి

సీతానగరం శ్రీమద్ వీరాంజనేయ కోదండ రామాలయం ఎదురుగా పుష్కర ఘాట్‌లో ఉన్న చెట్టుకు ఉరేసుకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుని వయసు 40 సంవత్సరాలు ఉంటుంది. తాడేపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## యువకుడుపై పోక్సో కేసు

ప్రజాశక్తి - మాచర్ల

మాయమాటలు చెప్పి మైనర్ బాలికను నమ్మించి తీసుకుపోయిన ఒక యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ సంధ్యారాణి శనివారం తెలిపారు. మాచర్ల పట్టణంలోని ఎరుకల కాలనీకి చెందిన మైనర్ బాలికను అదే కాలనీకి చెందిన 19 సంవత్సరాల జగన్నాథం కాటయ్య అనే యువకుడు ప్రేమిస్తున్నానని చెప్పి, పెళ్లి చేసుకుంటానని ఈనెల 5వ తేదీన రాత్రి సుమారు 9 గంటల సమయంలో బాలికను తీసుకు పోయాడు. అదే కాలనీ బుగ్గమల్లయ్య స్వామి గుడిలో ఆ రాత్రి ఇద్దరు కలసి ఉన్నారు. ఉదయాన్నే తీసుకొని వచ్చి ఇంటి దగ్గర వదిలిపెట్టి వెళ్లాడు. బాలికకు చిన్నతనం లోనే తల్లి చనిపోయింది. తండ్రి పట్టించుకోకుండా ఎటో వెళ్లిపోయాడు. అమ్మమ్మ వద్ద పెరుగుతోంది. అమ్మమ్మ ఫిర్యాదు మేరకు కాటయ్యపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు.




## పీసపాడులో కిశోర వికాసం కార్యక్రమం

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు మండలం, పీసపాడు గ్రామంలో శనివారం కిశోర వికాసం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా క్రీడలు, శారీరక వ్యాయామం గురించి సూపర్ వైజర్ మహి బున్నీసా సయ్యద్ వివరించి చెప్పారు. ఆటల ప్రాముఖ్యత గురించి, రోజూ గంట సేపు వ్యాయామం చేయడం వల్ల మానసిక ప్రశాంత, సమస్యలను ఎలా అధిగమించాలో వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కె, ఏఎన్ఎం, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు. క్రోసూరు సెక్టార్‌లోని గ్రామా లలో కిశోర బాల, బాలికలకు వ్యాయామం, క్రీడల ప్రాముఖ్యతను గురించి వివరించారు.

## పెనుగొండ వెంకటేశ్వరరావు సంతాప సభ

ప్రజాశక్తి - నరసరావుపేట టౌన్

స్థానిక శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల వైస్ ప్రెసిడెంట్ పెనుగొండ వెంకటేశ్వరరావు సంతాపసభను శనివారం కళాశాలలో నిర్వహించారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని వెంకటేశ్వరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. ఎమ్.ఎస్.సుధీర్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్ మాట్లాడుతూ పెనుగొండ వెంకటేశ్వరరావు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ నాగసరపు సుబ్బ రాయ గుప్తా మాట్లాడుతూ వెంకటేశ్వరరావు నిరంతరం శ్రీ సీతారామ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేశారని, విద్యార్థులకు మెరిట్ స్కాలరషిప్స్ ఇచ్చేవారని తెలియచేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొలిశెట్టి రామమోహనరావు, కూనిశెట్టి లక్ష్మయ్య, వక్కలగడ్డ కోటేశ్వరరావు, బత్తుల వెంకట మురళీధర రావు, తాడేపల్లి వెంకట భావన్నారాయణ, ఊటుకూరి రంజిత్ కుమార్, పెనుగొండ వెంకటేశ్వరరావు కుమారులు పెనుగొండ ప్రభాకర్, పెనుగొండ ప్రతాప్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. పి. శ్రీనివాస సాయి పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కళాశాల యాజమాన్యం, సిబ్బంది

# తారెత్తిస్తున్న ఎండలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నాలుగైదు రోజులుగా ఎండలు తారెత్తిస్తున్నాయి. పట్టణంలో గత బుధవారం 35 డిగ్రీలు గరిష్ట ఉష్ణోగ్రత నమోదవగా శుక్రవారం 43 డిగ్రీలకు చేరుకుంది. ఇదింకా తీవ్రమవుతుందని జనం ఆందోళనకు గురవుతున్నారు. మే 28 నుంచి జూన్ 14 వరకు రోహిణి అయినా బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఇటీవల వర్షాలు కురిశాయి. దీంతో వేసవి తీవ్రత నుండి తప్పించుకున్నామని అందరూ ఊపిరిపీల్చుకున్నారు. రైతులు సైతం వాతావారణ చల్లబడిందని సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో ఎండల తీవ్రత మళ్లీ పెరగడంతో పనులు వాయిదా వేస్తున్నారు.

ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదారు గంటల వరకు ఎండ ప్రభావం మరోవైపు విద్యుత్ కోతలతో జనం అల్లాడుతున్నారు. గ్రామాల్లో వేళాపాళలేని విద్యుత్ కోతల వల్ల సమస్య మరింత తీవ్రంగా ఉంది. వివిధ పనులపై ప్రయాణించేవారు, వాహనదార్లు నానా అవస్థలు పడుతున్నారు. ఎక్కడైనా నీడలో కాసేపు ఆగుదామని అనుకున్నా ఎక్కడా చెట్టు కానరావడం లేదు. ఎండల తీవ్రత కొనసాగితే 12వ తేదీ నుండి తమ పిల్లల్ని పాఠశాలలకు ఎలా పంపాలనేదానిపైనా తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవి తాపం నుండి సేదదీరేందుకని శీతల పానియాలు తాగకపోవడం మంచిదని, కొబ్బరినీళ్ల, మజ్జిగ, బార్లీ, రాగిజావ తీసుకోవాలని సూచిస్తున్నారు. మసాలాతో చేసిన ఆహార పదార్థాలకు, మాంసానికి దూరంగా ఉండాలని, ఆకుకూరలు అధికంగా తీసుకోవాలని అంటున్నారు.


అడ్డరోడు వద్ద నుంచి గడియార స్తంభం వరకు జనసంచారం లేకుండా ఉన్న రోడ్డు



## పిఎం సూర్యఘర్‌తో 22 ఏళ్ల పాటు ఉచిత విద్యుత్

ప్రజాశక్తి - రెంటచింతల

పిఎం సూర్యఘర్ పథకాన్ని ఉపయోగించుకుంటే 22 ఏళ్ల పాటు ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉందని, ఈ పథకం కింద సబ్సిడీ మరో రెండేళ్ల మాత్రమే అమలులో ఉంటుందని ఏపీ ట్రాన్స్‌కో ఇఇ సింగయ్య తెలిపారు. మండలంలోని పాల్వాయి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్లను శనివారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ 3 కిలో వాట్ల సామర్థ్యం గల సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుంటే రూ.2.10 లక్షలు బ్యాంకులో రుణాలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుండగా అందులో రూ.78000 సబ్సిడీ ఉంటుందని, తీసుకున్న రుణం మూడేళ్లలో తీరిపోతుందని చెప్పారు. మాచర్ల విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో 11 మండలాలు ఉన్నాయని, ఇప్పటివరకు 321 మంది పిఎం సూర్యఘర్ పథకాన్ని వాడుకుంటున్నారని, 8 వేల యూనిట్ల విద్యుత్ ఆయా కుటుంబాల నుంచి గ్రిడ్‌కు చేరుతోందని వివరించారు. విద్యుత్ సర్వీస్ లోడ్‌పై 50 శాతం రాయితీ పోగా మిగిలినవి చెల్లిస్తే సగానికి సగం మినహాయింపు ఉంటుందని, ఈనెల 30తో ముగుస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎఇ మస్తాన్‌వలి, సిబ్బంది ఉన్నారు.

## ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థికి గివింగ్ బ్యాక్ టు సొసైటీ రూ.లక్ష ప్రోత్సాహకం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పల్లపు శ్రీహర్షకు గివింగ్ బ్యాక్ టు సొసైటీ రూ.లక్ష ఆర్థిక సాయాన్ని సమకూర్చుగా తహశీల్దార్ మహమ్మద్ హుస్సేన్ శనివారం తన కార్యాలయంలో అందించారు. మండల పరిధిలోగల కావూరి గ్రామానికి చెందిన శ్రీహర్ష విజయవాడలోని శ్రీచైతన్య స్కూలులో ఇంటర్ చదివి 921 మార్కులు సాధించాడు. ఇంజినీరింగ్ విద్య కోసం గివింగ్ బ్యాక్ టు సొసైటీ ఈ మొత్తాన్ని ప్రోత్సాహకంగా అందించింది. సంస్థ అధ్యక్షులు మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి వారి కుటుంబంతోపాటు సమాజానికి చేయూత నివ్వాలని అన్నారు.




## మద్యం దుకాణాలపై నిఘా కోసం యాప్

ప్రజాశక్తి-ఈపూరు

మద్యం దుకాణాలపై నిఘా కోసం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ 'ఎక్సైజ్ ఐ' యాప్‌ను ప్రవేశపెట్టిందని సిఐ డి.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఈ యాప్ ద్వారా సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని చెప్పారు. నాటుసారా నిర్మూలనలో భాగంగా ఈనెల 20వ తేదీ వరకు నాటుసారా ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు. బొల్లాపల్లి మండలంలోని బ్రిడ్జి తండా, బోడిపాలెం తండా, ఇనిమెడ తండా, గండిగనుముల తండాలలో ఆకస్మిక తనిఖీలు చేశామని, అనుమానితులు, గతంలో కేసులున్నవారిపై నిఘా పెట్టామని చెప్పారు. గ్రామస్తులు, అధికారులను సమన్వయం చేసుకుంటూ సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

## శ్రీవివేకానంద విద్యాసంస్థల విజయ విహారం

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఇంటర్మీడియట్ బెటర్మెంట్ ఫలితాల్లో శ్రీ వివేకానంద విద్యాసంస్థలు నియోజకవర్గ స్థాయిలో మరోసారి విజయకేతనాన్ని ఎగురవేశాయని, అగ్రస్థానంలో తమ విద్యార్థులు నిలిచారని ప్రిన్సిపాల్ శిరీష అన్నారు. శనివారం ప్రకటించిన బెటర్‌మెంట్ ఫలితాల్లో తమ విద్యార్థులు 470 మార్కులకుగాను 464 మార్కులతో రాష్ట్రంలోనే మొదటి ఐదు ర్యాంకుల్లో ఒకటిగా నిలిచారన్నారు. ఎంపిసి విద్యార్థిని కొత్తంశెట్టి యామిని 440 మార్కులకుగాను 431 మార్కులను సాధించి పెదకూరపాడు నియోజకవర్గ స్థాయిలో అగ్రస్థానంలో నిలవగా బైపిసి విద్యార్థిని మాయకుంట్ల అక్షయ 431 మార్కులు సాధించినట్లు తెలిపారు. 35 మంది విద్యార్థులు 400 పైగా మార్కులతో పాటు నూరుశాతం ఉత్తీర్ణత సాధించామని చెప్పారు.




460కి పైగా మార్కులను ఎనిమిది మంది సాధించగా వారిలో కె.యామిని 464, టి.దివ్య 463, జి.శ్రావణి 463, ఎస్.బషీరా 462, వి.లీలా వెంకట పార్థు 462, ఎస్.కె షాహీన 462, పి.తిరుమల గోపీచంద్ 462, ఎన్.వర్షిని 460, పి.వీణా మాధురి 460 ఉన్నారన్నారు. బైపిసిలో ఎం.అక్షయ-431, పి.జితేంద్ర 424, కుంభా స్వాతి 411 ఉన్నారని వివరించారు. 450కిపైగా మార్కులు సాధించిన వారు 18 మంది, 400కిపైగా 35 మంది విద్యార్థులతో తెచ్చుకున్నారని చెప్పారు.



## జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ఎన్ విద్యార్థి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఒడిశా రాష్ట్రం, భువనేశ్వర్ కళింగ స్టేడియంలో ఈ నెల 22-26 తేదీల్లో జరిగే 78వ జాతీయ సీనియర్స్ స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి ఎస్.జగదీశ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్ సుధీర్ శనివారం తెలిపారు. కళాశాల స్విమ్మింగ్ పూల్ నందు జరిగిన 11వ సీనియర్ అంతర జిల్లాల స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. జగదీష్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, సెక్రెటరీ-కరెస్పాండెంట్, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయుగుప్తా, జాయింట్ సెక్రెటరీ పూటుకూరి వెంకట అప్పారావు, పాలకవర్గ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పానుగంటి శ్రీనివాససాయి, పీడీ డాక్టర్ యక్కల మధుసూదనరావు, అధ్యాపకులు అభినందించారు.

## చదువుతోపాటు విలువలకు చిరునామా లక్ష్య జూనియర్ కాలేజీ

- నాణ్యతా ప్రమాణాలతో బోధన
- ప్రతి ఏడాది ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు - నూరుశాతం ఉత్తీర్ణత
- 2025-26 ఏడాదికి అడ్మిషన్లు ప్రారంభం : చైర్మన్ బి.హరిబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా


బి.హరిబాబు

నరసరావుపేటలో 2018లో స్థాపించిన తమ కళాశాలలో అత్యుత్తమ ఫలితాలకు కేంద్ర బిందువుగా ఉందని లక్ష్య జూనియర్ కళాశాల చైర్మన్ బి.హరిబాబు అన్నారు. అనుభవం కలిగిన అధ్యాపకులు, ఒత్తిడి లేని బోధనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడమే ఇందుకు కారణమని చెప్పారు. గతేడాది ఇంటర్ ఫలితాల్లోనూ నూరుశాతం ఉత్తీర్ణతతో ఫలితాల పరంపరను కొనసాగించామన్నారు. తమ లక్ష్య విద్యాసంస్థల్లో సదుపాయాలపై ఆయన మాట్లాడుతూ...

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం పాలపాడు రోడ్డు సర్కిల్ వద్ద బాలురకు, రావిపాడు రోడ్డుకు వెళ్లే మార్గంలో బాలికలకు వేర్వేరుగా విశాలమైన నూతన భవన సముదాయంలో హాస్టల్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ సిలబస్‌తో పాటు ఎంపిసి-జెఈఈ (మెయిన్స్, అడ్వాన్స్) ఎంపిసి (ఇఏపిసెట్, జనరల్) బైపిసి- (ఐఎం) (నీట్) ఎంబైపిసి, సిఇసి, ఎంఇసి (తెలుగు, ఇంగ్లీషు మీడియం) కోర్సులను అనుభవం కలిగిన అధ్యాపకులచే బోధిస్తున్నామన్నారు. కళాశాలలో అత్యాధునిక తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు ఉన్నాయని తెలిపారు.

ఇటీవల ఇంటర్మీడియట్ ఫలితాల్లో పట్టణ స్థాయిలో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారని ఎన్.రాజేష్ 465 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ సాధించడం తమకంతో గర్వంగా ఉందని అన్నారు. ఉత్తమ ప్రమాణాలతో కూడిన విద్యను లాభాపేక్షకు తావులేకుండా అందించడమే తమ 'లక్ష్య'ంగా కొనసాగుతున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల విద్యార్థులకు అందుబాటులో, సాధారణ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామని, గ్రామీణ విద్యార్థులతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం ద్వారా పల్నాడు జిల్లాలో తమ విద్యాసంస్థ గుర్తింపు పొందిందని తెలిపారు. ర్యాంకుల మోజుతో విద్యా విధానంలో ఉన్నత విలువలకు ప్రాధాన్యత తగ్గిపోతున్న నేపథ్యంలో కేవలం ర్యాంకుల కోసమే విద్య అన్నట్లు కాకుండా విద్యార్థులకు మానసిక వికాసం కోసమూ అనే విషయాన్ని విద్యార్థులకు వివరిస్తున్నామన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో కళాశాల చైర్మన్ బి.హరిబాబు, అధ్యాపకులు

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల తమ విద్యార్థులు 100 ఉత్తీర్ణత సాధిస్తున్నారన్నారు. విద్యతో పాటు ఆటల పోటీలు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశ సంస్కృతీ సంప్రదాయాలను వివరిస్తూ వారిలో సామాజిక స్పృహ పెంచుతున్నామని, సందర్భానుసారంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులను సంపూర్ణ విద్యావంతులుగా తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని వివరించారు. తమ విద్యాసంస్థల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు మొదలైనట్లు తెలిపారు.

# మౌలిక వసతుల కల్పన బాధ్యత ప్రభుత్వానిదే

**ప్రజాశక్తి - పెదకాకాని**

ప్రజలకు మౌలిక అవసరాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. శనివారం పలు కాలనీలలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయాలని 20 సంవత్సరాలుగా ప్రభుత్వ భూములు ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న సుందరయ్య కాలనీ, స్వర్ణపూరి కాలనీ, శ్రీ లక్ష్మీ దుర్గ ఎస్టీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, వడ్డెర కాలనీ,జాన్ హస్పర్ తదితర కాలనీలలో నివాసం ఉంటున్న వారికి పట్టాలు మంజూరు చేయాలని గ్రామంలో ఇండ్ల స్థలాలు లేని పేదలు 2000 మంది పైన ఉన్నారని, వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఇండ్ల స్థలాలు ఇచ్చేవరకు దశల వారి పోరాటం ఉదఅతం చేస్తామని, సోమవారం ఉదయం పెదకాకాని తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాజా రమేష్, బురదగుంట సాంబయ్య ఆర్.వెంకటేశ్వర్లు, కాలనీవాసులు జెట్టి రాజలక్ష్మి, కె.పానకాలు, వెంకట్రావు, ఎం.వెంకాయమ్మ, షేక్ మస్తానమ్మ, దోసర మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నన్నపనేని శివాజీ

# ముగిసిన కంప్యూటర్ శిక్షణా తరగతులు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నళినీకాంత్, బుజ్జి తదితరులు

**ప్రజాశక్తి - గుంటూరు**

స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డు, ప్రగతి నగర్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మే 5 నుండి జూన్ 6 వరకూ నిర్వహించిన కంప్యూటర్ శిక్షణా తరగతులు ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు కె.నళినీకాంత్, రెడ్డిపాలెం మాజీ సర్పంచ్ బుజ్జి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే కాలమంతా కంప్యూటర్ కాలమని, నేడు ప్రతి పనిలో కంప్యూటర్ అవసరం ఉందని, దానిని నేర్చుకుంటే భవిష్యత్తులో ఎదగటానికి ఉపయోగపడుతుందని అన్నారు. చదువులలో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని అన్నారు. కంప్యూటర్ అవసరాన్ని గుర్తించి విద్యార్థులకు శిక్షణ ఇప్పించటం అభినందనీయమని అన్నారు. అనంతరం శిక్షణా తరగతులలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి కె.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం నేర్పిన ఎస్.శేఖర్ మాస్టర్‌ను, వాలంటీర్‌గా వ్యవహరించిన వ్యవహరించిన బి.సూర్జిత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రాగి వెంకటేశ్వరరావు, గంట్ల బాబు, పాములు, చెంచు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

## రజక కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

**ప్రజాశక్తి-గుంటూరు**

రజక కమ్యూనిటీహాల్ జిఎంసి ద్వారా స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం నాయకులు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవిని కోరారు. ఈమేరు శనివారం సంఘం నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందచేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుబ్బారావు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో రజక వత్తిదారులు వివిధ సామాజిక, కుటుంబ వేడుకల నిర్వహణకు, సామాజిక సమావేశాలకు ఫంక్షన్‌హాల్ లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కొరిటపాడు, గుజ్జనగుండ్ల, బందావన్‌గార్డెన్స్, విద్యానగర్, ఎస్‌విఎన్ కాలనీ శాంతినగర్ కాలనీ ప్రాంతాలలో రజక సోదరులు విరివిగా ఉన్నారని తెలిపారు. కావున జిఎంసి తరపున రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించే విధంగా కృషి చేయాలని కోరారు. అదే విధంగా వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న రజకులకు ఇంటి నివాస స్థలాలు కేటాయించాలని కోరుతూ అర్హులైన లబ్ధిదారుల జాబితాతో కూడిన మరో వినతి పత్రం అందజేశారు. ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో సంప్రదించి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది తుమ్మలపూడి శ్రీధర్, సంఘం జిల్లా అధ్యక్షులు మండూరు వెంకట నరసయ్య, జిల్లా కోశాధికారి వెంపాటి చిన్న కొండయ్య (సీతయ్య) నగర అధ్యక్షులు బెండమూరి లంక కైలాసం, భాస్కరరావు బెండమూరి లంక సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రజక వృత్తిదారుల సంఘం నాయకులు



ప్రొక్లెయినర్‌తో జరుగుతున్న పూడికతీత పనులు

## ముమ్మరంగా పూడికతీత పనులు

**ప్రజాశక్తి - తుళ్లూరు**

మండలంలోని పెదపరిమి గ్రామంలో మురుగునీటి తరలింపుకు చర్యలు చేపట్టారు. శనివారం పంచాయతీ కార్యదర్శి, ఇంచార్జ్ ఈవోఆర్డీ ఎం.శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి పెదపరిమి - మంగళగిరి రహదారికి ఇరువైపులా కాల్వల్లో మురుగు నీరు పారుదల సక్రమంగా జరిగేందుకు జెసిబిలతో పూడికతీత పనులు చేపట్టారు. కాల్వల్లోని జమ్మి, మట్టి వ్యర్థాలను ట్రాక్టర్లలో డంపింగ్ యార్డుకు తరలించారు.

## ప్రతిభా పురస్కారాలకు వివిధ కళాశాలల విద్యార్థుల ఎంపిక

**ప్రజాశక్తి - తెనాలి**

రాష్ట్ర ప్రభుత్వం అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రతిభా పురస్కారాలకు పట్టణంలోని వివిధ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ పాటిబండ్ల శ్రీనివాసరావు శనివారం వెల్లడించిన వివరాల ప్రకారం 2025 మార్చి పబ్లిక్ పరీక్షలలో సీఈసీ విభాగంలో 1000 మార్కులకు కెజశ్రీరామ్, డి.వి.సాయిరాం చరణ్ 955 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ప్రతిభ అవార్డులను ఎంపికయ్యారని, ఈ మేరకు ఇంటర్ బోర్డు ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందుకున్నట్లు తెలిపారు. ప్రతిభ అవార్డుల కింద ఒక్కో విద్యార్థికి మెడల్ తో పాటు రూ.20 వేల నగదు పారితోషికాన్ని అందిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినంది ంచారు.

**సెయింట్ పాల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో...**

స్థానిక నాజర్ పేట సెయింట్ పాల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థిని దేవరకొండ హేమీమా రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మకమైన ప్రతిభా పురస్కారానికి ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఎ.అబ్రహాం లింకన్ తెలిపారు. మార్చి 2025లో జరిగిన ఇంటర్ ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలలో కళాశాల ఉత్తమ ఫలితాలను నమోదు చేయగా, దేవరకొండ హేమిమా ఎల్‌ఎం అండ్ డి కోర్స్ విద్యార్థిని (వెటర్నరీ) సెకండ్ ఇయర్ లో 1000 మార్కులకు గాను 928 మార్కులు సాధించింది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచినందుకుగాను ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ కార్యాలయం నుంచి హేమీమా ప్రతిభ పురస్కారానికి ఎంపికైనట్లు సమాచారం ఇచ్చారన్నారు. కళాశాల స్థాపించిన నాటి నుండి ఇప్పటి వరకు 10 మంది విద్యార్థులు ప్రతిభ అవార్డులు పొందినట్టు చెప్పారు. ఈ ఏడాది ప్రతిభ అవార్డు సాధించిన హేమీమాను కళాశాల కరెస్పాండెంట్ ఎం.షీలా సుజని, అధ్యాపకులు డాక్టర్ స్వేచ్ఛ, కీర్తి అబ్రహం అభినందించారు.



ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన కె.శ్రీరాం, డి.వి. సాయిరాం చరణ్, డి.హెమీమా



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ వీరనారాయణ

## ఇంటర్ సెమిస్టర్‌లో వివేక విద్యార్థుల హవా

**ప్రజాశక్తి - తెనాలి**

ఇంటర్ పబ్లిక్ పరీక్ష ఫలితాలలో వివేక విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలను సాధించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచినట్లు డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ రావు శనివారం వెల్లడించారు. మార్చి పబ్లిక్ పరీక్షల్లో ఇంటర్ మొదటి సంవత్సరం పాసైనా, ఆశించిన మార్కులు రాని విద్యార్థులు అడ్వాన్స్ సప్లిమెంటరీలో బెటర్‌మెంట్ రాయడం ఆనవాయితీ. ఆ విధంగా పరీక్ష కు హాజరైన వారిలో శనివారం విడుదలైన ఫలితాల్లో ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను పి.సుహానా, ఎన్.కృష్ణప్రియ 467 మార్కులు సాధించారు. అలాగే ఆర్ వేద వర్షిణి, ఎల్.లిఖిత, ఇస్రఫ్ 465, ఎంఇసిలో 500 కు వై.లిఖిత 486, బైపిసిలో 440కి ఎస్.కె మిస్బా 433 మార్కులు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

## నేడు సీనియర్ సిటిజన్స్‌కు యోగ

**ప్రజాశక్తి - తెనాలి**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో 60 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్స్‌కి యోగా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బి.శేషన్న శనివారం తెలిపారు. సీనియర్ సిటిజన్స్ వేలాదిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



శివ నాగమల్లేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐఎంఏ బృందం

## ఘనంగా డాక్టర్ శివనాగమల్లేశ్వరరావు సంస్మరణ సభ

**ప్రజాశక్తి - తెనాలి**

ఇటీవల మృతి చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ గద్దే శివ నాగమల్లేశ్వరరావు సంస్మరణ సభ శనివారం స్థానిక బోస్‌రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ శివ నాగమల్లేశ్వరరావు తో ఉన్న అనుబంధాన్ని పలువురు వైద్యులు గుర్తు చేసుకున్నారు. వైద్య రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. తొలుత ఆయన చిత్రపటానికి వైద్య బృందం నివాళు లర్పించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ డాక్టర్ మధు ప్రభాకర్ బాబు, ఉపాధ్యక్షులు డాక్టర్ పావని ప్రియాంక, కోశాధికారి డాక్టర్ కె.శ్యాంప్రసాద్, డాక్టర్ జె.కోటి నాగయ్య, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ వి.శేషగిరిరావు, డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, డాక్టర్ గంట నరసింహారావు, ఐఎంఎ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం రవికుమార్

## ఆర్థికాభివృద్ధికి ఎస్‌బిఐ చేయూత

### ఎస్‌బిఐ ఆర్ఎం రవికుమార్

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

మహిళలు, రైతులు, యువత ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేయూతనిస్తోందని రీజనల్ మేనేజర్ పి.రవికుమార్ తెలిపారు. నరసరావుపేట పట్టణం లోని పల్నాడు రోడ్డులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీ య కార్యాలయంలో ప్రకాష్ నగర్‌లోని ఎస్‌బిఐ (ఏడిబి) ఆధ్వ ర్యంలో మహిళలు, రైతులు, యువతకు అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రీజినల్ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలలోని మహిళలకు రూ. లక్ష నుండి పది లక్షల వరకు వ్యాపార నిమిత్తం, నాలుగు ఎకరాలు పైబడిన రైతులకు రూ. కోటి వరకు, యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి రుణాలను అందజేస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్య క్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఏడిబి) శాఖ మేనేజర్ ఎం పాల్ బెజా లీల్,ఎస్‌బిఐ (ఏడిబి) ఫీల్డ్ ఆఫీసర్ రమణయ్య, ఎస్బిఐ బ్యాంక్ అధికారులు, సిబ్బంది, వెలుగు ఏపీఎం భరత్, సిసిలు, డ్వాక్రాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



భౌతిక కాయం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా

## గుండెపోటుతో పాత్రికేయుడు మృతి

**ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్**



బుల్లా రాజశేఖర్ (ఫైల్)

సివిఆర్ పాత్రికేయుడు గుండె పోటుతో మరణించాడు. సత్తెనపల్లి మండలం భగుబండ గ్రామానికి బుల్లా రాజశేఖర్ (32) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెం దాడు. శుక్రవారం రాత్రి గుండె నొప్పి రావటంతో హుటాహుటిన గుంటూరు తరలించారు. తెల్లవారు జామున మరోసారి తీవ్రమైన గుండె నొప్పి రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజశేఖర్ సివిఆర్ ఎలక్ట్రానిక్ మీడియాలో సత్తెనపల్లి నియోజకవర్గ పాత్రికేయు డిగా పని చేస్తున్నారు. రాజశేఖర్ మరణ వార్త ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులలకు దిగ్భ్రాంతి కలిగించింది. రాజ శేఖర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం అంత్యక్రియలు జరుగు తాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

**రాజశేఖర్ భౌతిక కాయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే**

సివిఆర్ పాత్రికేయుడు మృతి చెందిన విషయం తెలుసు కున్న సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## పల్లా సింహాచలం మృతికి ఎమ్మెల్యే సంతాపం

**ప్రజాశక్తి - మాచర్ల**

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివారావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే సింహాచలం (93) మృతి పట్ల మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అలానే నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న టీడీపీ శ్రేణులు పల్లా సింహాచలం మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

# భక్తి శ్రద్ధలతో బక్రీద్ పర్వదినం

### ఈద్గా మైదానాల్లో సామూహిక నమాజులు



ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**ప్రజాశక్తి- మాచర్ల**

త్యాగానికి, విశ్వాసానికి, మానవతా విలువలకు ప్రాతినిధ్యం వహించి, మత, సామాజిక ఐక్యతను పెంపొందించే ఈద్-అల్-అదా (బక్రీద్) పండుగను శనివారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో వేడుకలను నిర్వహించారు. పట్టణ, మండల పరిధిలోని మజీద్‌లు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈదుల్-అజా ప్రత్యేక నమాజు అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముస్లీం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపి, ప్రేమ, త్యాగం, సహనం, పరోప కారానికి ప్రతిరూపకంగా బక్రీద్ వేడుకలు జరుపు కోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కుల,మతాలకతీతంగా పరమత సహనం పాటిస్తూ సోదర భావంతో కలిసి మెలిసి జీవించాలని ఆకాంక్షించారు.

**ప్రజాశక్తి- చిలకలూరిపేట**

మండలంలో మత సామరస్యం, త్యాగం, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచే పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణ, మండల పరిసర గ్రామాల్లోని ఈద్గా మైదానాలు ఉదయం 8 గంటలకే భక్తులతో నిండి పోయాయి. గ్రామాల్లోని మసీదులు, వీధులు పండుగ, భక్తి వాతావరణంతో కళకళలాడాయి. "అల్లాహ్ హుఅక్బర్... అల్లాహ్ హూ అక్బర్. లా ఇలాహ్ ఇల్లల్లాహు, అల్లాహ్ హుఅక్బర్... అల్లాహ్ హూ అక్బర్ లా ఇలాహ్ ఇల్లల్లాహు...అల్లాహు అక్బర్, వలిల్లాహిల్ హంద్" అంటూ తక్బీర్ పఠనంతో మైదానమంతా శాంతియుత, భక్తి వాతావరణంతో మార్మోగింది. ఖుర్బానీ అంటే దేవుని ఆజ్ఞకు లోబడి తనకిష్టమైన దాన్ని త్యాగం చేయడమని, అదే ఈ పర్వదినం విశిష్టతని వివరించారు. బయాన్ తర్వాత సామూహిక పండుగ నమాజ్‌ను చదివించారు. నమాజు అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా, మసీదు, ఇళ్ల వద్ద దాన ధర్మాలు చేశారు. ఖుర్బానీ చేసిన పొట్టేళ్ల పోషకాహారాన్ని ఇరుగుపొరుగు, బంధుమిత్రులకు పంపిణీ చేసి అల్లాహ్ సూచించిన కర్తవ్యాన్ని సంతోషంగా నిర్వర్తించారు.

**ప్రజాశక్తి- క్రోసూరు**

విశ్వాసం, త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఘనంగా జరుపుకున్నారు. క్రోసూరు మండలం లోని అన్ని గ్రామాల్లోని ఈద్గాల వద్ద ఉదయాన్నే నమాజ్ ఆచరించారు. ముందుగా ముస్లిం 'ఇమామ్‌లు పండుగ సందేశాన్ని వినిపించారు. ఇబ్రహీం ప్రవక్త దేవుని ఆదేశానుసారం తన ప్రియమైన కుమారుడు ఇస్మాయిల్‌ను బలి ఇచ్చేందుకు సిద్ధపడిన ఉదంతాన్ని, ఆయన త్యాగానికి మెచ్చిన భగవంతుడు ఇస్మాయిల్ స్థానంలో గొర్రెను ఏర్పాటు చేసి బలిని పూర్తి చేశారని పేర్కొన్నారు. ఖుర్బానీ ఇచ్చిన మాంసాన్ని విధిగా పేదలకు పంచాలని, దీంతో మాజంలో ఆకలి బాధలు తొలగిపోతాయన్నారు. నమాజ్ అనంతరం ముస్లిం సోదరులందరు మరణించిన వారి పెద్దలకు దుఆ చేయడానికి స్మశానం వద్దకు తరలి వెళ్లారు.



మాచర్ల ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

**ప్రజాశక్తి- పల్నాడు జిల్లా**

నరసరావుపేట పట్టణంలో ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో బక్రీద్‌ను రుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రకాష్ నగర్ లోని ఈద్గా మైదానంలో పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా ముస్లింలు ఈద్గాకు తరలివెళ్లి మౌలానా ఆధ్వర్యంలో నమాజ్ చేసి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నమాజ్ అనంతరం వారు అల్లాహ్ దయతో ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖ సంతోషాలతో మెలగాలని ప్రార్థించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఈద్గా నమాజులో పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానధర్మాలు చేశారు. పట్టణం లోని వివిధ ప్రాంతాలలోని మసీదులలో ముస్లిం సోదరులు ఈద్ నమాజ్ చేశారు.

**ప్రజాశక్తి- యడ్లపాడు**

మండలంలో మత సామరస్యం, త్యాగం, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచే పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొత్త దుస్తులు ధరించి, సాంప్రదాయ బద్దమైన అలంకరణలో పిల్లలు, యువకులు, పెద్దలు కలిసి మసీదులు, ఈద్గా మైదానాలకు తరలివెళ్లారు. బోయపాలెం, యడ్లపాడు పరిసర గ్రామాల్లోని ఈద్గా మైదానాలు ఉదయం 8 గంటలకే భక్తులతో నిండిపోయాయి. ఈద్గా, మసీదు, ఇళ్ల వద్ద దానధర్మాలు చేశారు. ఖుర్బానీ చేసిన పొట్టేళ్ల పోషకాహారాన్ని ఇరుగుపొరుగు, బంధుమిత్రు లకు పంపిణీ చేసి అల్లాహ్ సూచించిన కర్తవ్యాన్ని సంతోషంగా నిర్వర్తించారు.

# తొలి ఏడాదిలోనే 80 శాతం హామీలు అమలు

### ఇంటింటికీ కుళాయి పనులకు శంకుస్థాపనలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

**ప్రజాశక్తి - వినుకొండ**

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 80శాతం హామీలు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ మండలం ఏనుగు పాలెంలో జల్‌జీవన్ మిషన్ కింద రూ.71 లక్షల వ్యయంతో తాగునీటి ట్యాంక్, ఇంటింటికీ కుళాయి పథకానికి శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావుతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 60 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించనున్న తాగునీటి ట్యాంకు ద్వారా గ్రామంలో 450 ఇళ్లకు రక్షిత మంచినీరు సరఫరా చేయనున్నామన్నారు. మరో 350 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు రూ.25 లక్షలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరానని, ఆ నిధులు సమకూర్చే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. త్వరలోనే మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభిస్తామని, మరికొన్ని రోజుల్లోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అమలు చేయబోతున్నామ తెలిపారు. దీపం-2 పథకం కింద ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, పాడి రైతుల కోసం రూ.2 లక్షల వ్యయంతో షెడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. గుత్తేదారులు నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా త్వరితగతిన జల్‌జీవన్ మిషన్ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో రోడ్లపై గుంతలను కూడా పూడ్చలేదని, పిల్లలు చదువుకోవడానికి వెళ్లేందుకు బస్సులు రాని పరిస్థితి కూడా చూశామని, కూటమి ప్రభుత్వం రాగానే అంతటి గుంతలను కూడా పూడ్చిందని, రాష్ట్రవ్యాప్తంగా 20 వేల కిలోమీటర్ల మేర గుంతలను పూడ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఏనుగుపాలెం రహదారిని రెండు లైన్లుగా విస్తరిస్తామని చెప్పారు.



కుళాయి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జీవీ

## 'అభిమానం తలకెక్కకూడదు'

**ప్రజాశక్తి-చిలకలూరిపేట**

ఏ విషయంలోనూ వ్యక్తులపై అభిమానం తలకెక్కించుకోకూడదని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకులు మాదాసు భానుప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటకలో రాయల్ చాలెంజర్స్, బెంగళూరు క్రికెట్ టీం క్రీడాకారులను అభినందించే కార్యక్రమంలో తొక్కిస లాట జరిగి 11 మంది చనిపోవడం, 50 మందికిపైగా గాయపడడం బాధాకరమని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల కిందట భారతదేశంలో పెద్దగా ప్రాచుర్యంలేని క్రికెట్‌ను కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం వ్యూహాత్మకంగా, కుటుంబాలలో కూడా "ఆటంటే కేవలం క్రికెట్" మాత్రమే అనే భావన కలిగించేలా చేశారని పేర్కొన్నారు. అదే క్రమంలో క్రికెట్ మినహాయించి ఇతర క్రీడలు ఫుట్బాల్, వాలీబాల్, హాకీ, దేశీయ క్రీడలు, గ్రామీణ క్రీడలు, అథ్లెటిక్స్ లాంటి ఇతర క్రీడలను ప్రాధాన్యత లేనివిగా తయారు చేశారని తెలిపారు. సినిమాల కోసం, క్రికెట్ కోసం, బిగ్‌బాస్ కంటెస్టెంట్స్ కోసం ప్రాణాల మీదకు తెచ్చు కోవడం ఏమిటని ప్రశ్నిం చారు? గతంలో క్రీడా ప్రదేశాలలో, ఇండ్ల మధ్య స్థలాలలో పిల్లలు అనేక రకాల ఆటలు ఆడుకునే వారనీ, ఇపుడా ఆ పరిస్థితి లేదని పేర్కొన్నారు. వయసుతో సంబంధం లేకుం డా ఎక్కడ చూసినా క్రికెట్ బ్యాట్లతో కనిపి స్తున్నారని తెలిపారు. ఇతర ఆటలకు తగిన ప్రోత్సాహం ఉంటే ఎక్కువ మంది పతకాలు సాధించ గలుగుతారని, అంతర్జాతీయ క్రీడా పథకాల పట్టికలో మన స్థాయిని మెరుగుపరచుకునేందుకు అవకాశం కలుగు తుందని పేర్కొన్నారు. ఒలంపిక్స్ పథకాల పట్టికలో చివరి వరుసలో ఉండటానికి తగిన క్రీడా సదు పాయాలు ఇప్పటికీ నగర ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉండటం శోచనీయమని అన్నారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఆరుగురు విద్యార్థులు ఎంపిక

**ప్రజాశక్తి-ఈపూరు**

2024-25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ చాటిన ఆరుగురు విద్యార్థులను షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపిక చేసినట్లు ఎంఈఓ- 2 రామ తులసి తెలిపారు. మండలంలోని ఎ ముప్పాళ్ళ గ్రామంలోని విద్యానికేతన్ ప్రైవేటు పాఠశాలకు చెందిన ఓపెన్ కేటగిరి చెందిన విద్యార్థులు యర్రం అనుష (592),అరవపల్లి సత్యసాయి శ్రీ విజ్ఞ (588),బీసీ-సి కేటగిరికి చెందిన విద్యార్థి లక్కెపోగు జాసిన్త (582), ఈపూరు ఏపీ మోడల్ స్కూల్ బీసీ-బి కేటగిరికి చెందిన విద్యార్థిని గమిడి కీర్తన (580), శ్రీ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన ఎస్సీ కేటగిరి విద్యార్థిని అక్కిదాసరి ప్రసన్నకుమార్ (559), ఎస్టి కేటగిరికి చెందిన విద్యార్థి కాండ్రకొండ రాకేష్ (517) మార్కులు సాధించి షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికయ్యారు. వీరు ఈనెల తొమ్మిదవ తేదీన కలెక్టర్ అరుణ్ బాబు చేతుల మీదుగా సర్టిఫికెట్, మెడల్, రూ.20 వేలు అందుకోనున్నారు.

## మాచర్ల టు అరుణాచలం టూర్

**ప్రజాశక్తి - మాచర్ల రూరల్**

మాచర్ల పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు, భక్తులకు, యాత్రాభిలాషులకు ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా సంస్థ మంచి సదవకాశం కల్పిస్తుందని, మాచర్ల బస్‌డిపోనుండి ప్రతి నెలపౌర్ణమి రోజున అరుణా చలంలోని అరుణాచలేశ్వరుని దర్శనము (గిరి ప్రదక్షణ) టూర్‌కు సూపర్ లగ్జరిబస్సు ఏర్పాటు చేయుచున్నట్లు మాచర్ల ఆర్టీసి బస్ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి శనివారం తెలిపారు. ఈనెల 09 తేదీ రాత్రి 7 గం॥లకు మాచర్ల బస్టాండ్ నుండి బస్సు బయలుదేరి, 10న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, గోల్డెన్ టెంపుల్ దర్శనము, 11న అరుణాచలం, గిరి ప్రదక్షణ అరుణాచలేశ్వరుని దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమై మాచర్లకు 12వ తేదీ ఉదయం 7 గం॥లకు చేరుతుందని చెప్పారు. జులై 8వ తేదీ నుండి 11వ తేదీ వరకు, ఆగస్టు 7వ తేదీ నుండి 10వ తేదీ వరకు ప్రత్యేక బస్ ద్వారా టూర్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ టూర్ టిక్కెట్ వెల ఒక్కొక్కరికి రాను, పోను రూ.2,750లు చార్జి అవుతుందని, ఈ అవకాశాన్ని మాచర్ల పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కొరకు 9959225432, 7382895100, 7382801048 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

# కెఎల్‌యూలో ఉద్యోగాల పండుగ

- మేనేజ్‌మెంట్ హ్యూమానిటీ సైన్స్, వ్యవసాయ, ఫార్మసి ఇతర డిగ్రీ కోర్సుల విభాగాలలో ఉద్యోగాలు సాదించిన కెఎల్‌యూ విద్యార్థులు
- 7 వేల మందికి పైగా కంపెనీ ఆఫర్లు
- 5 వేల మందికి పైగా ప్లేసెమెంట్స్

**ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్**

క్యాంపస్ ప్లేసెమెంట్స్‌లో వడ్డేశ్వరం కేఎల్‌యూ విద్యార్థుల హవా కొనసాగుతోంది. మేనేజ్‌మెంట్ హ్యూమానిటీ సైన్స్, వ్యవసాయ, ఫార్మసి ఇతర డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల విద్యార్థులు సైతం 155కు పైగా కంపెనీలలో ఉద్యోగాలు సాధించారని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ తెలిపారు. వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ ప్రాంగణంలో నిర్వహించిన ప్లేస్ మెంట్ సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల కంపెనీలకు చెందిన సిఈఓలు బొల్లినేని సురేష్ బాబు, డాక్టర్ పి. వేణుగోపాలరావు, శామ్యూల్ ఫిలిప్ బాబు, వివిఎస్ఆర్. ప్రసాద్ ఓరుగంటి, రామ్ చందర్ సౌందర్ రాజన్ లు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. చదువు పూర్తి అయ్యే లోపు తమ పిల్లలు ఉద్యోగాలు సాధించే విధంగా కృషి చేసిన కెఎల్ యు యాజమాన్యానికి, ఆచార్యులకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారది వర్మ మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల విషయంలో కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. అందులో భాగంగానే ఈ ఏడాది 450 కి పైగా జాతీయ కంపెనీలు, 50 కి పైగా అంతర్జాతీయ కంపెనీలు ప్రాంగణ ఎంపికల కోసం తమ యూనివర్సిటీకి వచ్చాయని వెల్లడించారు. మేనేజ్‌మెంట్ హ్యూమానిటీ సైన్సెస్ విభాగం కింద డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులైన మేనేజ్మెంట్, బిజినెస్, వ్యవసాయం, ఫార్మసీ, కామర్స్, ఆర్కిటెక్చర్ వంటి కోర్సులకు చెందిన విద్యార్థులు కూడా ఈ ఏడాది ఉన్నత స్థాయి ఉద్యోగాలను పొందారని చెప్పారు. వీరందరికీ బ్యాంకు ఆఫ్ అమెరికా, డెలాయిట్, ఐటిసి, ఆక్సెంచర్, టిసిఎస్ వంటి 155 కు పైగా కంపెనీలలో 15 వందల మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయాని అన్నారు. కాగా వీరిలో 1087 మంది విద్యార్థులు ఉద్యోగాలను స్వీకరించారని పేర్కొన్నారు. డిగ్రీ కోర్సులలో 10.7 లక్షల సి టి సి అవకాలను తమ విద్యార్థులు దక్కించుకున్నారని చెప్పారు. యూనివర్సిటీ ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్ రామ్ మాట్లాడుతూ కె ఎల్ యూనివర్సిటీలో ఏ కోర్సు చదివినా మంచి ప్యాకేజీతో ప్లేసెమెంట్ వచ్చేలా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా ఇటీవలే ఇండస్ట్రీ ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్ ప్రారంభించినట్లు చెప్పారు. క్యాంపస్ లోనే 15 కు పైగా కంపెనీలు ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికే 3 కంపెనీలు ఏర్పాటు అయ్యాయని స్పష్టం చేశారు. నైపుణ్యాల అభివృద్ధిలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వటం, నాణ్యమైన డిగ్రీలతో జాతీయ, అంతర్జాతీయ కంపెనీలలో విద్యార్థులు ప్లేస్ అయ్యేలా వారిని సిద్ధం చేయటం యూనివర్సిటీ ప్రధాన ఆశయమని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, అకడమిక్ అడిషనల్ డీన్ హరికిరణ్ వేగే, స్కిల్ డెవలెప్ మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, ప్లేస్ మెంట్ అసోసియేట్ డీన్ డాక్టర్ పి.చలపతి, సీనియర్ డైరెక్టర్ డాక్టర్ శరవణబాబు, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, అన్ని విభాగాల విభాగాధిపతులు పాల్గొన్నారు.



విద్యార్థిని ఎస్.యశస్వినికి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న వివిఎస్ఆర్. ప్రసాద్ ఓరుగంటి



దుగ్గిరాలలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

## ఘనంగా బక్రీద్ పండగ వేడుకలు

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

భక్తికి విశ్వాసానికి ప్రతీకైనా ఈద్-ఉల్-అధా (బక్రీద్) పండుగను ముస్లిం సోదరులు శనివారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రం దుగ్గిరాలతో పాటు మండలంలోని పెనుమూలి కంఠంరాజు కొండూరు చిలువూరు తుమ్మపూడి దేవేంద్రపాడు గ్రామాలలోని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాంప్రదాయ బద్ధంగా జరిగిన ఈ కార్యక్రమంలో పిల్లలు పెద్దలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుసుకున్నారు.



మంగళగిరిలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

**ప్రజాశక్తి - మంగళగిరి**

మంగళగిరి పట్టణంలో శనివారం బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. గౌతమ్ బుద్ధ రోడ్‌లో గల ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అదేవిధంగా పలు ప్రాంతాల్లో ఉన్న మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.




## రోడ్డుకి అడ్డుగా చెట్లు.. వాహనదారులకు ఇక్కట్లు

**ప్రజాశక్తి - తెనాలిరూరల్**

ఏపుగా పెరిగిన చెట్టు రహదారిపై వెళ్తున్న వాహనాలకు ఇబ్బందికరంగా మారింది. బాగా విస్తరించిన చెట్టు కొమ్మలు వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తుంది. తెనాలి ఐతానగర్ నుంచి నేలపాడు వెళ్లే మార్గంలో హయ్యర్ పేట ప్రధాన కూడలి వద్ద భారీ వఅక్షం దాని కొమ్మలు నివాసాలపైకి విస్తరించి ప్రమాదకరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. చెట్టు కొమ్మలు కిందకు వొరగడంతో శనివారం ఆ మార్గంగుండా వెళ్తున్న లారీ శనివారం రోడ్డుపై నిలిచిపోయింది. అంతే కాకుండా కొమ్మలమద్యన విద్యుత్ లైన్లు ఉండడంతో స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అక్కడ హోటల్ నిర్వాహకులు అందె జాకబ్ శాస్త్రి కోరారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - చేబ్రోలు**

విద్యుదా ఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొత్త రెడ్డిపాలెం చెన్నారెడ్డి కాలనీలో శనివారం జరిగింది. కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కారుమూరి ధనం బాబు ఇంటి అవసరాల కోసం మోటర్ ద్వారా నీటిని పట్టుకొను సందర్భంలో విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందటం జరిగింది. ఈయనకు భార్య మరియమ్మ, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం వున్నారు. మృతుని కుమారుడు లక్ష్మయ్య అతని భార్య, ఇద్దరు పిల్లలు రోజువారి కూలి పని చేస్తుంటాడు. కాలుకి యాక్సిడెంట్ కావడంతో తండ్రి ధనంబాబు సంపాదనపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఒక్కసారిగా ఇంటికి పెద్దదిక్కు ధనం బాబు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంతో విలపిస్తున్నారు. దీనిపై తహశీల్దార్ కె.శ్రీనివాస శర్మ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను కలెక్టర్‌కి పంపుతాము అన్నారు. జరిగిన ఘటనపై పోలీసులు, డాక్టర్లు ఇచ్చే రిపోర్టును బట్టి తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపారు. అయితే మినిస్ట్రీ ఆఫ్ లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ భారత ప్రభుత్వం రోజువారి కూలీ పని చేసి జీవనం సాగించే అసంఘటిత కార్మికులకు కోసం ప్రవేశపెట్టిన, 'ఈ శ్రామ్' ద్వారా ప్రమాద బీమా వర్తించేలా నమోదు చేసుకోవడం , దీనికి సంబంధించి మృతుడు కారుమూరి ధనం బాబుకు యూనివర్సల్ అకౌంట్ నెంబర్, (యుఎఎన్)తో ఈ శ్రామ్ కార్డు ఇచ్చారు. లేబర్ డిపార్ట్మెంట్ రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయ కార్య ఆచరణతో మాత్రమే మృతుని కుటుంబ సభ్యులకు పరిహారం అందే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ అధికారులు చొరవ చూపి బాధిత కుటుంబానికి పరిహారం అందేలా చూడాలని బంధువులు , గ్రామస్తులు కోరుతున్నారు.



మృతిచెందిన ధనం బాబు




మాట్లాడుతున్న మంత్రి సత్య కుమార్ యాదవ్

## శివస్వామి ట్రస్ట్ ద్వారా 64 సేవలు

**ప్రజాశక్తి - తుళ్లూరు**

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం మండలం శివారు గ్రామం తాళ్లాయపాలెంలోని శ్రీ శైవ క్షేత్రంలో ధర్మో రక్షతి రక్షత్త ట్రస్టు నూతన భవనాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ శనివారం ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,శ్రీ శైవక్షేత్రం పీఠాధిపతి శివ స్వామి ట్రస్ట్ ద్వారా 64 సేవా విభాగాలు ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. సంస్కృతి పట్ల యువతకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. దాతలు వెంకట సతీష్, ఉమారాణి దంపతులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

## సచివాలయాల్లో నీటి తీరువా బకాయిలు చెల్లించండి

**ప్రజాశక్తి - చేబ్రోలు**

రైతులు తమ భూములకు సంబంధించిన నీటి తీరువా బకాయిలను సచివాలయాల్లో చెల్లించాలని తహశీల్దార్ కె.శ్రీనివాస్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గొడవర్రు, నారాకోడూరు, వేజెండ్ల, వడ్లమూడి, శ్రీరంగపురం, మంచాల, సుద్దపల్లి, మీసరగడ్డ అనంతవరం (వీరనాయకునిపాలెం) గ్రామాల్లో భూములు ఉన్న రైతులు వారి భూములకు 1434 వ ఫసలీ వరకు చెల్లించవలసిన నీటి తీరువా బకాయిలను వారి సమీప గ్రామ/వార్డు సచివాలయము లో రైతు ఖాతా నెంబరు తెలిపి డిమాండ్ తెలుసుకొని శనివారం నుండి చెల్లింపు చేసుకోన వచ్చునని తహశీల్దార్ కె.శ్రీనివాస శర్మ పత్రిక ప్రకటనలు తెలిపారు.





ఎండలు తీవ్రత పెరగడంతో నిర్మానుష్యంగా మారిన గౌతమ్ బుద్ధ రోడ్డు, నిర్మానుష్యంగా ఉన్న తెనాలిలోని అంబేద్కర్ కూడలి

# మండుతున్న ఎండలు.. నిర్మానుష్యంగా రహదారులు

**ప్రజాశక్తి - మంగళగిరి**

మే నెల చివరలో వర్షాల వలన వాతావరణం చల్లబడినప్పటికీ, నాలుగు రోజులుగా భానుడు భగభగమంటున్నాడు. ఎండలు మండుతున్నాయి. రోహిణి కార్తె ఆదివారంతో అయిపోతుంది. రోహిణి కార్తెలో ఎండలు తీవ్రంగా ఉంటాయి. దీంతో మంగళగిరిలో ప్రజలు రోడ్లపైకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. శనివారం రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. సాయంత్రం ఐదు గంటల తర్వాత జనం రోడ్లపైకి చేరుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఎండల తాకిడికి వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. 39 డిగ్రీలు ఉష్ణోగ్రత శనివారం మంగళగిరిలో నమోదైంది.

**ప్రజాశక్తి-తెనాలిరూరల్**

భానుడి ప్రతాపాన్ని తట్టుకోలేక ప్రజలు విలవిల్లాడుతున్నారు. తెనాలిలో ఎండవేడిమితో శనివారం ప్రధాన కూడళ్లైన రజక చెరువు, గాంధీ చౌక్, శివాజి చౌక్, గంగానమ్మ సెంటర్, వహాబ్ చౌక్ లు నిర్మానుష్యంగా మారాయి. స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు రోడ్లపై వాహనాల రాకపోకలు లేక ఖాళీగా దర్శనమిచ్చాయి. ఋతుపవనాలు సమీపిస్తున్న తరుణంలో ఎండలు తీవ్రత ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. ఎండలు తగ్గినంతవరకు ఇళ్లల్లో నుంచి బయటికి రాకపోవడమే మంచిదని, తప్పని పరిస్థితుల్లో బయటకు వస్తే చలువ కళ్ళజోళ్ళు, తలకు టవలు, టోపి ధరించాలని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

## జిజిహెచ్ నుంచి రిమాండ్ ఖైదీ పరారీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరుప్రభుత్వ ఆస్పత్రి నుంచి శనివారం రిమాండ్ ఖైదీ పరారు అయ్యారు. చేబ్రోలు మండలం లో ఇటీవల జరిగిన కె.గోపి హత్య కేసులో ప్రధాన నిందితుడు నాగుల్ మీరాగుంటూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా పోలీసుల కళ్ళ గప్పి పరారయ్యాడు. ఈమేరకు జైలు నుంచి తీసుకువచ్చిన పోలీసులు స్థానిక కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగుల్ మీరా కోసం గాలిస్తున్నట్లు కొత్తపేట పోలీసులు తెలిపారు.



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

## ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

### నేడు డిఇఒ ఆఫీసు ముట్టడికి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జిటి) లకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు వెబ్ ఆప్షన్లు పెట్టుకోమని ఒత్తిడి చేయటాన్ని నిరశిస్తూ నేడు డిఇఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. ప్రభుత్వ ద్వంద్వ విధానాన్ని నిరశిస్తూ శనివారం గుంటూరు ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చేసిన వాగ్దానం మరచి, వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని ఉపాధ్యాయులకు ఫోన్లు చేసి ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. బలవంతంపు కౌన్సెలింగ్‌ను బాయ్‌కాట్‌కు నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకత్వానికి, ప్రభుత్వానికి మధ్య జరిగిన చర్చల సందర్భంగా ప్రభుత్వ హామీ మేరకు ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. డిఇఒ ఆఫీసు ముట్టడి కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు కె.బసవలింగారావు, ఎమ్.కళాధర్, డి.పెదబాబు, శ్రీనివాస్, సంపత్, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, సుధీరబాబు, హనుమంతరావు, సుబ్బారెడ్డి, రమేష్, ఆదినారాయణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రాజధాని పరిసరాల్లో నిలిచిన లావాదేవీలు

వీక్షణం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జిల్లాలో భూముల క్రయ విక్రయాలు పెరుగతాయని అంచనా వేసిన వారికి నిరాశ ఎదురయింది. మూడు రాజధానుల నినాదంతో అమరావతి నిర్మాణంపై అయోమయం ఏర్పడటంతో గత ప్రభుత్వ హయంలో జిల్లాలో భూముల క్రయ విక్రయాలు దాదాపగా నిలిచిపోయాయి. టిడిపి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే రాజధాని అమరావతికి మళ్లీ పూర్వవైభవం వస్తుందని, తమ భూములకు ధరలు పెరుగుతాయని భావించిన రైతులకు ప్రస్తుతం నిరాశ మిగిలింది. తొలి విడతలో 2015లో భూ సమీకరణ ద్వారా తీసుకున్న 34 వేల ఎకరాల భూములను అభివృద్ధి చేసి రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇంత వరకు ఇవ్వలేదు. మరో వైపు రెండో విడత భూ సమీకరణకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేయడాన్ని రైతుల నుంచి కొంత వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. తొలి దశలో భూములు ఇచ్చిన వారికి ప్లాట్లు ఇవ్వడానికి 10 ఏళ్ల దాటిపోతే తమకు ఎంత కాలం పడుతుందో..మధ్యలో పాలకులు మారితే ఎన్ని ఇబ్బందులు వస్తాయోనని భూములు ఉన్న రైతులు ఆందోళనలో ఉన్నారు. రెండో విడత భూ సమీకరణకు 44 వేల ఎకరాలకు ప్రతిపాదనలు చేయగా ఇప్పటి వరకు 24 వేల ఎకరాలకు చెందిన రైతులు సానుకూలంగా ఉన్నట్టు మంత్రి నారాయణ ఇటీవల అంచనా వేశారు. అంతర్జాతీయ విమానాశ్రయంకు 4,500 ఎకరాలు, వ్యాపార కార్యకలాపాలకు 2500 ఎకరాలు, రైల్వే లైను, ఇతర నిర్మాణాలకు మరో 3500 ఎకరాలు అవసరం అని మంత్రి నారాయణ గతంలో అంచనా వేశారు. రాజధాని వెలుపల 44 వేల భూ సమీకరణ నిర్ణయంతో రాజధాని గ్రామాల్లో గత మూడు నెలలుగా భూముల క్రయ విక్రయాలు పూర్తిస్థాయిలో మందగించాయి. గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు రాజధాని గ్రామాల్లో క్రయ విక్రయాలు ఉత్సాహంగా జరగ్గా ఫిబ్రవరి నుంచి క్రమంగా తగ్గుముఖం పట్టాయి. ప్రధానంగా రైతులు అధిక ధరలు చెప్పడం వల్ల కొనుగోలు చేసే వారి సంఖ్య తగ్గిపోయింది. అలాగే రాజధానికి సమీపంలో గరిష్టంగా 10 నుంచి 20 కిలో మీటర్ల దూరంలోనే రెండో విడత భూ సమీరకణ ప్రతిపాదనలు చేయడంతో రాజధాని గ్రామాల్లో కొనుగోళ్లు పూర్తిగా మందగించాయి. దీంతో రాజధానిలో ఇప్పటికే భూములు ఇచ్చిన రైతులంతా అసంతృప్తితో ఉన్నారు. అయినా వారు బహిరంగంగా మాట్లాడేందుకు ఇష్టపడటం లేదు. రాజధాని గ్రామాల్లో వేగంగా అభివృద్ధి చేసిన ప్లాట్లును రైతులకు అప్పగించి తరువాత మలివిడత భూసేకరణ చేపడితే బాగుండేదన్న భావన ఎక్కువ మంది రైతుల్లో వ్యక్తం అవుతోంది. ప్రధానంగా అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వే లైన్లు, స్పోర్ట్సు స్టేడియం, పారిశ్రామిక వేత్తలకు భూముల కేటాయింపు కోసం మలి విడత సమీకరణ చేయనున్నట్టు మంత్రి నారాయణ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో గత రెండు నెలల క్రితం ఉన్న రియల్ ఎస్టేట్ భూమ్ క్రమంగా తగ్గుతూ వస్తోంది. రాజధాని వెలుపల ఉన్న మండలాల్లో కూడా గత కొంత కాలంగా లావాదేవీలు స్తంభించాయి. ఏ ప్రాంతంలో భూములు తీసుకుంటారో...ఏ అభివృద్ధి పనికి ఏ ప్రాంతంలో భూములు అవసరమో తెలియక చాలామంది ప్రస్తుతం కొనుగోలును వాయిదా వేసుకుంటున్నారు. ఏయే ప్రాంతాల్లో ఏయే ప్రాజెక్టులు వస్తాయి. ప్రభుత్వం సమీకరణ ఏ ప్రాంతంలో ఎంత తీసుకుంటుందో తెలియడం లేదని రైతులు చెబుతున్నారు. దీని వల్ల తాము భూములు విక్రయంచుకోలేకపోతున్నామన అమరావతి, తాడికొండ మండలాల రైతులు వాపోయారు. రాజధాని అమరావతిలో 2015లో చేసిన భూ సమీకరణ పరిధి 217 చదరపు కిలో మీటర్ల వరకే ఉన్నాయి. నిబంధనల పరిధిని పెంచేందుకు కసరత్తు జరుగుతోంది. అంతేగాకుండా రాజధానిలో రైతులకు ఇచ్చిన సదుపాయాలే మలివిడత భూ సమీకరణలో రైతులకు కూడా ఇవ్వాలని దాదాపు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మలివిడత భూ సమీకరణలపై గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని దాదాపు నాలుగు మండలాల్లోని 20 గ్రామాల్లో భూ సమీకరణకు సన్నాహాలు ఇప్పటికే జరుగుతు న్నాయి. తుళ్లూరు మండలంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, అమరావతి మండల ంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గ్రామ సభలు నిర్వహించి రైతులను మానసికంగా సిద్ధం చేశారు. కొంత మంది వ్యతిరేకించిన వారు ఉన్నారు. రాజధానికి సమీపంలో ఉన్న మండలాల్లో రోడ్డు పక్కన భూములకు అధిక ధరలు ఉండటం, లోపల భూములకు తక్కువ ధరలు ఉండటం వల్ల ఇద్దరికీ ఒకే ప్యాకేజీ ఎలా అని పలువురు రైతులు మధనపడుతున్నారు.

(ఎ.వి.డి.శర్మ)



# జీవితంలో ఎవ్వరూ భయపడద్దు

### కన్నప్ప ప్రి రిలీజ్ వేడుకల్లో మోహన్‌బాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జీవితంలో భయం అనేది లేకుండా ప్రతి ఒక్కరూ బతకాలని ప్రముఖ సినీనటుడు ఎం.మోహనబాబు కోరారు. గుంటూరులోని స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం రాత్రి కన్నప్ప ప్రిరిలీజ్ వేడుకలు ఘనంగా జరిగాయి. మోహనబాబు మాట్లాడుతూ సినిమా రంగంలో తాను స్వయం కృషితో కష్టపడి పైకి వచ్చానని తెలిపారు. కన్నప్ప సినిమా కోసం తన కుమార్డు విష్ణు ఆరేళ్లపాటు కష్టపడ్డాడని తెలిపారు. మానవత్వం, మంచిహృదయం వున్న వ్యక్తి ప్రభాస్ ఈ సినిమాలో నటించేందుకు అంగీకరించారని తెలిపారు. బలవంతుడు ఎదురొచ్చినప్పుడు తలదించిన వాడు బాగుపడతాడు..ఎదురించిన వాడు వాగులో పడతాడని వ్యాఖ్యానించారు. నిన్న జరిగింది మర్చి పోను...నేడు జరగాల్సింది వాయిదా వేయను...రేపు జరగబోయే దాని గురించి ఆలోచించను...దటీజ్ రామన్న అంటూ మోహనబాబు డైలాగ్‌లతో అభిమానులను అలరించారు. మంచు విష్ణు కీలక పాత్రలో రూపొందించిన కన్నప్ప, ప్రీతిముకుందన్, శరత్‌కుమార్, ముకేష్ రుషి, రఘుబాబు, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు. ఈ సినిమాలో ప్రభాస్, మోహన్‌లాల్, కాజల్, అక్షయ్‌కుమార్ అతిథి పాత్రలో కన్పించనున్నట్టు నిర్వహకులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకట్రావు సోదరులు తాడిశెట్టి వెంకట్రావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ కౌలు రైతులకూ ఇవ్వాలి

### 11న ధర్నా జయప్రదం చేయాలని నాయకుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - పెదకాకాని

అన్నదాత సఖీభవ ద్వారా పెట్టుబడి సాయం రూ.20వేలు కౌలు రైతులకు వర్తింప చేయాలని కోరుతూ వ్యవసాయ కమిషన్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు కోరారు. శనివారం నంబూరు గ్రామంలో కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేయడం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో పాశం రామారావు మట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేస్తామని వాగ్దానం చేసిందని కాని ఇంత వరకు వాగ్దానాన్ని అమలు చేయలేదన్నారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకి గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని, అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింప చేయాలని కోరారు. జిల్లాలో 86వేల ఎకరాలలో నల్లబర్లీ పొగాకు సాగుచేశారని, కాని ఇంత వరకు పొగాకు కొనుగోలు చేయలేదని రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, రాష్ట్రప్రభుత్వం, కంపెనీలు స్పందించి నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంటలకు మద్దతు ధరలు చాలదని, ఇది కేవలం కంటితుడుపు చర్య అన్నారు. ఈనెల 11వ తేదీన జరిగే ధర్నాలో కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు ఎమ్.శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



నంబూరులో రైతులతో మాట్లాడుతున్న పాశం రామారావు

## ప్రభుత్వ హామీలను నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట మండల, నియోజకవర్గ స్థాయిలో నూటికి 70 శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల ను వారి ఖాతాలలో జమచేయా లని, ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. రాధాకృష్ణ శనివారం నాడు ఒక ప్రకటనలో అన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడుస్తున్న ఇప్పటికీ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. ప్రభుత్వం వాగ్దానం చేసిన విధంగా రైతులతో పాటు, కౌలు రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ పథకం కింద 20,000 ను వెం టనే జ మ చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఒకవైపున వ్యవ సాయ రంగం సంక్షోభం ఏర్పడి, పండించిన పొగా కు పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక,అ సలు కొనే వారు లేక కౌలు రైతులుఅనేక ఇ బ్బందులు పడుతున్నా రన్నారు. వాస్తవ సాగుదారుల పేరుతోనే ఈ క్రాప్ నమోదు చేయాలన్నా రు. సమస్యల పరిష్కార సాధన కొరకు 11న ఉద యం 10 గంటల కు జరిగే చలో వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యా లయం రైతులు, కౌ లు రైతులు అందరూ విరివిగా పాల్గొని కా ర్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.